సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 27 । జూలై । 2023



ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె..

ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి కౌన్సె లింగ్ ప్రారంభమైంది. శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. - 8లో



భారతావనిలో పుట్టడం గర్వకారణం

భారతదేశంలో మనమంతా జన్మించడం గర్వ కారణమని ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు అన్నారు. బుధవారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. - 8లో

డిగ్రీ పరీక్షలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: భారీ వర్షాల కారణంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ల పరీక్షల్ని వాయిదా వేసినట్లు పరీక్షల డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం తెలిపారు. గురు, శుక్ర వారాల్లో జరగాల్సిన ఈ పరీక్షలను వచ్చే నెల 16, 17 తేదీలకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మిగతా పరీక్షలు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని తెలిపారు.

న్యూస్‌రీల్

ఔట్‌సోర్సింగ్ నియామకాలకు ఈ-టెండర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో తాజాగా పాలకమండలి తీసుకున్న నిర్ణయాల మేరకు పలు అంశాలపై బహిరంగ వేలం/టెండర్ ప్రక్రియలను వచ్చే నెలలో చేపడతామని ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిత్యాన్నదానం, ప్రసాదాల తయారీ విభాగాలతో పాటు కార్యాలయ విభాగాల్లో అవసరమైన మ్యాన్ పవర్‌ను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా భర్తీ చేసేందుకు వచ్చే నెలలో ఈ-టెండర్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. వీఐపీల ప్రోటోకాల్ అమల్లో భాగంగా స్వామి వారి ఫొటోలు, కండువాలు, బ్లౌజు పీసులు తదితరాలతో పాటు నిత్యం గర్భాలయంలో స్వామి వారి అలంకరణకు పూలు, పూలదండలు సరఫరా చేసేందుకు కూడా బహిరంగ వేలం/టెండర్‌ను వేయనున్నామని తెలిపారు. ఆసక్తిగల వారి నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు వర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల27, 31వ తేదీల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో బుధవారం వివరాలు వెల్లడించారు. గురువారం ఏట్రోడ్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని, ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుందని, సీఎస్‌ఈ, ఈసీఐ, ఎంసీఏ పూర్తిచేసిన వారు అర్హులని వివరించారు. 31న ఏప్రోనిక్స్ సంస్థ నిర్వహించే ఇంటర్వ్యూలకు డిప్లమా, ఇంజినీరింగ్, బీఎస్సీ పూర్తిచేసిన వారు అర్హులని, ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల వారు వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ (9848819969)ను సంప్రదించాలని సూచించారు.


గిరిజన మహిళల అభ్యున్నతే లక్ష్యం



పైనాపిల్ ఉత్పత్తులతో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస: గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన అనంతరం మహిళలు గ్రూపుగా ఏర్పడి పైనాపిల్‌తో జామ్, క్యాండీ, స్క్వాష్‌లు తయారుచేసి ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత మాట్లాడుతూ ఫుడ్ రిజిస్ట్రేషన్, లేబిలింగ్, మార్కెటింగ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.మౌనిక, గిరిజన యువతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆరోగ్యశ్రీ అమలు



మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు సులభంగా, విస్తృతంగా అందించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ట్రస్టు నియమ నిబంధనలను ఆస్పత్రులు విధిగా పాటించాలన్నారు. నెట్‌వర్కు ఆస్పత్రిలో వైద్యం అందలేదనే ఫిర్యాదు రాకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నెలా ఆరోగ్యశ్రీ సేవలు వివరాలు అందజేయాలన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి వచ్చిన సమాచారం ఎప్పటికప్పుడు నోటీస్ బోర్డులో పొందుపరచాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం జీవధార సిద్ధం





ప్రాజెక్ట్ ద్వారా నీరు ప్యూరిఫై అవుతున్న దృశ్యం (ఇన్‌సెట్లో) మెళియాపుట్టిలో మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఉద్దానం.. పుడమికి పచ్చని వడ్డాణం.
కానీ.. ఈ సుందర సీమ హృదయంలో అంతులేని కన్నీటి కాసారం.
కిడ్నీ వ్యాధి రూపంలో వేధిస్తున్న విషాదం.
అయితే ప్రతి వేదనకూ ఓ ఉపశమనం ఉంటుంది.
ఉద్దానానికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూపంలో సాంత్వన దక్కేందుకు రంగం సిద్ధమైంది.
ఉత్కళాంధ్రకు వరమైన వంశధార.. అమృతధారలా మారి ఉద్దానం గొంతు తడపనుంది.
రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన మంచినీటి ప్రాజెక్ట్ దాదాపు సిద్ధమైంది. దీనికి సంబంధించి బుధవారం ట్రయల్ రన్ జరిగింది.

- సమగ్ర మంచినీటి పథకం ప్రాజెక్టు ట్రయల్ రన్
- తాగు, సాగునీటికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి సీదిరి
- కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

హిరమండలం/మెళియాపుట్టి: జిల్లాలో తాగు, సాగునీటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం హిరమండలంలోని వంశధార రిజర్వాయర్ వద్ద ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి(మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు)సంబంధించి ట్రయల్ రన్ చేపట్టారు. మంత్రితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ నర్తు రామారావులు పాల్గొని ప్రాజెక్టు పని తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంశధార రిజర్వాయర్ అపర భగీరథగా నిలుస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. కరోనా నేపథ్యంలో పనుల్లో జాప్యం ఏర్పడిందని, లేకుంటే ఈ పాటికే పూర్తి అయ్యేదన్నారు. కొండలు, నదులు దాటి పైపులైన్ ఏర్పాటు గొప్ప విషయమన్నారు. ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం నియోజకవర్గాల ప్రజల దాహార్తి తీర్చేందుకు దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేసిన సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిదన్నారు. దాదాపు 200 కిలోమీటర్ల మేర వంశధార జలాలను తీసుకువెళ్లే అద్భుతమైన ప్రాజెక్టుగా అభివర్ణించారు. మొత్తం 1040 కిలోమీటర్ల మేర పైపులై న్లు ఏర్పాటు చేయడం భగీరథ ప్రయత్నమని పేర్కొన్నారు. త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. జిల్లా ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. అనంతరం మెళియాపుట్టిలోని మెగావాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ఉద్దానం కిడ్నీ వ్యాధులు ప్రబలకుండా మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. హిరమండలం నుంచి ఇచ్ఛాపురం వరకు నీటిని అందించాలనే ఆలోచన రావడం అద్భుతమని, వెంటనే నిధులు మంజూరు చేసిన గొప్ప నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ జగనన్న మేధాశక్తితో ఆలోచించి, ఎంతోమంది నిపుణులతో చర్చలు జరిపి ప్రాజెక్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఉద్దానంతో పాటు పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాలకు ఇంటింటికీ తాగునీరు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే 2.5 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఈ ఆశాలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాస్‌ప్రసాద్, ఈఈ జి.జాన్‌సుధన్, డీఈఈ జి.మధుసూదనరావు, తహశీల్దార్ మురళీమోహన్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మీసాల రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హిరమండలంలో ఉద్దానం ప్రాజెక్టు ఇన్‌టెక్ వెల్ వద్ద బటన్ నొక్కి ట్రయల్ రన్ ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మణిపూర్‌లో మారణహోమం అరికట్టాలి

కాశీబుగ్గ: మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న మారణహోమాన్ని అరికట్టాలని, మహిళలపై అత్యాచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో నిరసన ర్యాలీ చేపట్టారు. రాష్ట్రాన్ని కాపాడలేని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సవర జగన్నాయకులు, ఏఐఏఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఈశ్వరరావు, పలాస మండల శాఖ అధ్యక్షుడు సవర విజయ్, ఆదివాసీ వికాస పరిషత్, మందస కార్యవర్గ సభ్యులు, పలాస గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.



కాశీబుగ్గలో నిరసన తెలుపుతున్న ఆదివాసీ విద్యార్థులు

కాపు నేస్తం పథకానికి ఈకేవైసీ తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: కాపునేస్తం పథకంలో లబ్ధిపొందేందుకు కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారు వార్డు, గ్రామ వలంటీరు వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ బుధవారం తెలిపారు. 45 నుంచి 60 ఏళ్ల మహిళలు అర్హులని పేర్కొన్నారు. గత మూడుసార్లు లబ్ధి పొందిన వారు కూడా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. అర్హులైన వారికి నాలుగో విడతలో భాగంగా త్వరలో రూ.15 వేలను ప్రభుత్వం జమ చేస్తుందని పేర్కొన్నారు.

వదలని వాన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో బుధవారం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలుచోట్ల నగరంలో రోడ్లు జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. జిల్లా వ్యాప్తంగా 1016.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గార మండలంలో 76.2 మి.మీ., అత్యల్పంగా కొత్తూరులో 8.4 మి.మీ.వర్షపాతం నమోదైంది.

వర్షపాతం మి.మీ.లలో

గార 76.2	ఎచ్చెర్ల 46.4	శ్రీకాకుళం 46.8
ఎల్.ఎన్.పేట 11.4	లావేరు 47.2	రణస్థలం 53.8
కోటబొమ్మాళి 40.0	మెళియాపుట్టి 14.2	సారవకోట 8.6
సరుబుజ్జిలి 20.8	పలాస 50.2	జలుమూరు 25.2
సంతబొమ్మాళి 38.2	పోలాకి 41.6	హిరమండలం 8.6
కంచిలి 54.2	ఇచ్ఛాపురం 12.8	నరసన్నపేట 38
పాతపట్నం 11.2	మందస 42	వజ్రపుకొత్తూరు 35.2
పొందూరు 50.2	ఆమదాలవలస 26	బూర్జ 18.4
కవిటి 27.4	సోంపేట 70.4	టెక్కలి 27.2
జి.సిగడాం 40.2	నందిగాం 25.6	కొత్తూరు 8.4



శ్రీకాకుళంలో జలమయమైన రోడ్డు



నరసన్నపేట: శివనగర్ కాలనీలో రోడ్డుపై చేరిన నీరు



సరుబుజ్జిలి: ముంపుబారిన తురకపేట భూములు



ఎచ్చెర్ల క్యాంపస్: జరజాం సమీపంలో ఫ్లై ఓవర్ వంతెన కింద చేరిన నీరు



నీటితో నిండిన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ

సొగసుల సిరికాకుళం

- శ్రీకాకుళం నగరం సుందరీకరణపై ప్రత్యేక దృష్టి
- కోట్లాది రూపాయలతో పార్కుల అభివృద్ధి
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కుడ్య చిత్రాలు
- ఎవెన్యూ ప్లాంటేషన్, స్మార్ట్ స్ట్రీట్ రోడ్డులతో ఆహ్లాదకర వాతావరణం



శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలో రూ. కోటితో అభివృద్ధి చేసిన నాగావళి రివర్ వ్యూ పార్కు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సిక్కోలు సరికొత్త రూపును సంతరించుకుంటోంది. నగరాన్ని ఆహ్లాదకరంగా, సుందరంగా, అందరికీ నివాసయోగ్యంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రూ.7.25 కోట్లు నగర సుందరీకరణకు వెచ్చించింది.

పార్కుల ఆధునికీకరణ..

సాయంత్రమైతే నగర ప్రజలు సేద తీరేందుకు, ఉదయం వాకింగ్ చేసేందుకు, పిల్లల ఆట విడుపు కోసం నగరంలోని ఆరు పార్కులపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో రూ.3.70 కోట్లతో గ్రీనరీతో కూడిన అభివృద్ధి చేశారు. శాంతినగర్‌లోని గాంధీ మందిరం పార్కును రూ.40 లక్షలు, శాంతినగర్ కాలనీలోని నాగావళి రివర్ వ్యూ పార్కును రూ.కోటి, కొత్తపేటలోని చల్లా నర్సింహం మున్సిపల్ పార్కును రూ.60లక్షలు, బాపూజీ కళామందిర్‌లో వద్ద గాంధీ పార్కును రూ.40లక్షలు, అఫీషియల్ కాలనీలోని డాక్టర్ అబ్దుల్ కలామ్ పార్కును రూ.40 లక్షలు, న్యూకాలనీలోని డైమండ్ పార్కును రూ.30 లక్షలు, పీఎన్ కాలనీ పార్కును రూ.60 లక్షలతో సుందరీకరణతో కూడిన అభివృద్ధి చేశారు. కాంపౌండ్స్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్స్ తదితర వసతులు, సౌకర్యాలు సమకూర్చారు. వీటితో పాటు విజయాదిత్య పార్కును ఆధునీకరించేందుకు రూ.2.20 కోట్ల నిధులు కేటాయించారు. ఇక్కడ త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.



రూ. 60లక్షలతో కొత్తపేటలో అభివృద్ధి చేసిన చల్లా నర్సింహం మున్సిపల్ పార్కు

కుడ్య చిత్రాలు అదరహో..

నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా సంస్కృతి ప్రతిబింబించేలా 33 ప్రదేశాల్లో కుడ్య చిత్రాలు(మ్యూరల్ పెయింటింగ్స్)ను వేశారు. ప్రభుత్వ కార్యాలయాల కాంపౌండ్ వాల్స్, మూడు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, నాలుగు వంతెనలు, సెంట్రల్ డివైడర్లు, కళాశాలలు, స్కూల్స్ కాంపౌండ్ వాల్స్‌కు ఆయా ప్రాంత విశిష్టతలతో పాటు పిల్లలను అలరించే చిత్రాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం దేవాలయాలు, వంశధార, నాగావళి నదుల ప్రాధాన్యతను తెలియజేసేలా పెయింటింగ్స్‌తో తీర్చిదిద్దారు. ఇందుకు రూ.75లక్షలు ఖర్చు చేశారు.



కొత్తరోడ్డు ఫ్లై ఓవర్ కింద వేసిన మ్యూరల్ పెయింటింగ్స్

అరసవల్లిలో ఆధునికీకరణ..

అరసవల్లి దేవస్థానంలో రూ.35లక్షలతో భక్తుల రక్షణ కోసం జింక్ రేకు షెడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. మరో 5.87 కోట్లతో ఇంద్ర పుష్కరిణి ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు ఆగస్టు మొదటి వారంలో శంకుస్థాపన చేయనున్నారు. వీటికి సంబంధించి ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి.

రూ.1.68 కోట్లతో ఎవెన్యూ ప్లాంటేషన్..

నగరమంతా పచ్చదనం కన్పించేలా, ప్రజలకు మంచి వాతావరణం ఉండేలా రూ.కోటీ 68లక్షలతో హరిత నగరాల కింద శ్రీకాకుళం నగరంలోని 18 ప్రాంతాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్(మొక్కలు) నాటారు. రోడ్డుకు ఇరువైపులా, కొన్ని చోట్ల రోడ్ల మధ్యన మొక్కలు పెంచుతున్నారు. పాత్రునివలసలో కొత్తగా నిర్మించిన టిడ్కో కాలనీలో కూడా పచ్చదనం కోసం మొక్కలు నాటారు.



పాత్రునివలస టిడ్కో కాలనీలో ఎవెన్యూ ప్లాంటేషన్

రూ.1.40 కోట్లతో స్మార్ట్ స్ట్రీట్ రోడ్డు..

కలెక్టరేట్ నుంచి కొత్తపేట వరకు మోడల్ రోడ్డు పేరిట రూ.కోటి 40 లక్షలతో స్మార్ట్ స్ట్రీట్ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీతో పాటు మ్యూరల్ పెయింటింగ్స్‌తో అందంగా తీర్చిదిద్దారు. అక్కడే రోడ్డుకు ఆనుకుని ఉన్న చిన్న పార్కును కూడా అభివృద్ధి చేశారు.



కలెక్టరేట్ నుంచి కొత్తపేట వరకు అభివృద్ధి చేసిన స్మార్ట్ స్ట్రీట్ రోడ్డు

మరో రూ.10.50 కోట్లతో నగరంలో బీటీ రోడ్లు..

ఆర్‌అండ్‌బీ పరిధిలోకి రాని నగరంలోని మిగతా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే రూ.10.50 కోట్లు మంజూరయ్యాయి. 37ప్రాంతాల్లో బీటీ రోడ్లు వేసేందుకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. వీటి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఇవి పూర్తయితే వీధులు మరింత అందంగా కన్పించడమే కాకుండా రహదారి సమస్య తీరడంతో పాటు డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దొరకనుంది.

'పచ్చ'ందాల సిక్కోలు మా లక్ష్యం..



నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పార్కుల ఆధునికీకరణతో పాటు వివిధ ప్రాంతాల్లో పెయింటింగ్స్ వేశాం. ప్రజలు హాయిగా అందమైన వాతావరణంలో గడిపేలా రూ.7.25కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. మరో రూ.2.20 కోట్లతో విజయాదిత్య పార్కును అభివృద్ధి చేయనున్నాం. వీటితో పాటు రూ.10 కోట్లతో చేపట్టే రోడ్డు పనులు పూర్తయితే నగరం మరింత ఆకర్షణీయంగా కనబడనుంది.

– ఓబులేష్, కమిషనర్, శ్రీకాకుళం నగర పాలక సంస్థ

క్లుప్తంగా

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు ఉచితంగా 30 రోజుల టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, చదవటం, రాయటం తెలిసిన వారు ఆగస్టు నాలుగో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదో తేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 95534 10809, 79933 40407 నంబర్లను సంప్రదించాలి.

వర్షాలకు కూలిన గోడ

సారవకోట: బుడితి గ్రామంలోని గొడగల వీధికి చెందిన ముంజేటి సింహాచలం ఇంటి గోడ వర్షాలకు బుధవారం కూలి పోయింది. నాలుగు రోజుల నుంచి వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో గోడ నానిపోయి కూలి పోయినట్లు బాధితుడు తెలిపాడు. గోడ కూలిన సమయంలో ఎవ్వరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

కొండచిలువ హతం



స్థానికుల చేతిలో హతమైన కొండచిలువ

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ గ్రామంలో భారీ కొండచిలువ బుధవారం హల్‌చల్ చేసింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు త్రినాథపేట కాలనీ సమీపంలోని కొండపై నుంచి సుమారు ఏడడుగుల కొండచిలువ బెల్లుపడ గ్రామంలోకి చొరబడింది. ఓ ఇంట్లోకి వెళ్లిన కొండచిలువ అక్కడ ఉన్న కోళ్లను మిగేందుకు ప్రయత్నించగా.. అవి అరవడంతో ఇంట్లో ఉన్నవారు వచ్చి చూడగా కొండచిలువ కనిపించడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కొంతమంది ధైర్యం చేసి అక్కడ నుంచి కొండచిలువను తరిమేసేందుకు ప్రయత్నించగా వారిపై తిరగబడడంతో చేసేదిలేక కర్రలతో కొట్టి హతమార్చారు.

నేడు కిసాన్ సమృద్ధి కేంద్రాల ఏర్పాటు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కిసాన్ సమృద్ధి కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రారంభిస్తున్నట్లు బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు సమ్మాన్ నిధిని దేశప్రధాని నరేంద్రమోదీ గురువారం రైతు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 144 రైతు సమృద్ధి కేంద్రాలు తొలి విడతగా గుర్తింపబడ్డాయన్నారు. ఇకపై అయా కేంద్రాల్లో రైతుకు సంబంధించిన అన్ని పనిముట్లు ఒకే వేదిక ద్వారా రైతుకు అందించడం కిసాన్ సమృద్ధి కేంద్రాల ప్రధాన ఉద్దేశమన్నారు. శ్రీకాకుళంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

28న జీడి కార్మికుల సత్యాగ్రహ దీక్ష

కాశీబుగ్గ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28వ తేదీన ఉదయం పది గంటల నుంచి కాశీబుగ్గ బస్టాండ్ దారి గాంధీ విగ్రహం ఎదుట జీడి కార్మికులు 24 గంటల సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నారు. ఈ విషయాన్ని జీడి రైతు సంఘం ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ సమక్షంలో చేపట్టనున్న దీక్షకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సత్యాగ్రహ దీక్షా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.ఎన్.శర్మ ప్రారంభిస్తారన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,160-00
బంగారం(22సి. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,400-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ఇంజనీరింగ్ ప్రవేశాలకు వేళాయె..

- శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు
- జిల్లాలో నాలుగు ఇంజనీరింగ్ కళాశాలలు
- పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేస్తున్న ప్రభుత్వం
- కళాశాల ఎంపికే కీలకమంటున్న నిపుణులు



ఇంజనీరింగ్ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజనీరింగ్ విద్యలో చేరేందుకు సమయం ఆసన్నమైంది. ఇప్పటికే ఏపీఈఏపీసెట్ ఫలితాలు వెల్లడి కావడంతోపాటు ప్రవేశాల కోసం షెడ్యూల్‌ను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూపు పూర్తి చేసిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఇంజనీరింగ్‌లో చేరేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉపాధి అవకాశాలు లభించటం, అందుబాటులో ఇంజనీరింగ్ కళాశాలలు ఉండటం, పూర్తిస్థాయి ఫీజు స్ట్రక్చర్‌ను ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా ప్రభుత్వం అందజేస్తుండడంతో ఎక్కువ మంది ఇంజనీరింగ్ విద్యపై ఆసక్తి చూపుతున్నారు.

కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రస్తుతం ప్రవేశాల ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా నుంచి ఎంపీసీ స్ట్రీం పరీక్షకు 5,517 మంది హాజరయ్యారు. ర్యాంకు, ఆసక్తి మేరకు జిల్లా విద్యార్థులు రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరుతున్నారు. జిల్లాకు చెందిన బాలికలు ఎక్కువగా స్థానికంగా ఉన్న కళాశాలల్లోనే చదవడానికి ఇష్టపడుతున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ఇబ్బందులు ఉంటే ఇక్కడ సరిచేస్తారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సరిఫికెట్ల అప్‌లోడ్ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కాగా.. ఆగస్టు నాలుగు వరకు కొనసాగుతుంది. విద్యార్థులు ఆగస్టు మూడు నుంచి ఎనిమిదో తేదీ వరకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. తొమ్మిదో తేదీన మార్పు చేసుకోవటం కోసం మరో అవకాశం కల్పించారు. 12వ తేదీన సీట్ల ప్రకటన, 13, 14 తేదీల్లో కాలేజీలకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. 16వ తేదీ నుంచి క్లాస్ వర్కు ప్రారంభించనున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో సైతం మెరుగైన ప్రమాణాలతో విద్యను అందిస్తున్న కళాశాలలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు మూడు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఈ నాలుగు కళాశాలల్లో 3,310 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలలో మొత్తం సీట్లను కన్వీనర్ కోటాలో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో 70 శాతం కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో.. మిగిలిన 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో ఖాళీ సీట్లను సైతం వారు మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు కల్పించుకునే వెసులుబాటు యాజమాన్యాలకు ఉంది.

జిల్లా కళాశాలల్లో సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, ట్రిపుల్ఈ, మెకానికల్, ఐటీ, డేటాసైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి బ్రాంచ్‌లు ఉన్నాయి. సీట్లను విద్యార్థికి వచ్చిన ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా కేటాయిస్తారు.

జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల వివరాలు

కళాశాల	సీట్లు
టెకలి, ఐతం	1200
ఎచ్చెర్ల, శ్రీవెంకటేశ్వర	420
చిలకపాలెం, శ్రీ శివానీ	360
ఎచ్చెర్ల బీఆర్ఏయూ	330

ప్రమాణాలతో కూడిన విద్య



జిల్లాలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కళాశాల బీఆర్ ఏయూలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల. మొత్తం సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. సెల్ఫ్ ఫైనాన్స్ కళాశాల అయినా ప్రభుత్వ రాయితీలు మొత్తం వర్తిస్తాయి. పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన వర్తిస్తాయి. వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. నూతన విద్యా విధానం నేపథ్యంలో ఉన్నత విద్యా మండలి, నేషనల్ కౌన్సెల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిబంధనల మేరకు ప్రమాణాతో కూడిన విద్య అందిస్తున్నారు. ప్రత్యేక ప్లేస్‌మెంట్ సెల్ నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, ప్రిన్సిపాల్, బీఆర్ఏయూ ఇంజినీరింగ్ కళాశాల

నచ్చిన కళాశాలను ఎంపిక చేసుకోవచ్చు



విద్యార్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో అపరిమితంగా కళాశాలలు ఎంపిక చేసుకోవచ్చు. ప్రాధాన్యత క్రమంలో కళాశాలలు, బ్రాంచ్‌లు ఎంపిక చేసుకుంటే ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు లభిస్తాయి. విద్యార్థులు కౌన్సెలింగ్‌లో ఇబ్బందులు ఉంటే సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. విద్యార్థులు తాము చేరబోతున్న కళాశాలలో గత ఐదేళ్ల నుంచి ప్రవేశాలు ఎలా ఉన్నాయి, లభిస్తున్న ప్లేస్‌మెంట్లు, నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపులు, పూర్వ విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తెలుసుకోవాలి. నాలుగేళ్ల ఇంజనీరింగ్ అనంతరం మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా ఉండే కళాశాలను ఎంపిక చేసుకోవాలి.

– గురుగుబెల్లి దామోదరరావు, సహాయ కేంద్రం కోఆర్డినేటర్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

భారతావనిలో పుట్టడం గర్వకారణం

- ఇండియన్ ఆర్మీ కాలింగ్ సేవలు అమోఘం
- ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు
- కార్గిల్ అమర సైనికులకు ఘన నివాళి



రక్తదాన శిబిరం వద్ద ఏఎస్పీ విఠలేశ్వరరావు, ఆర్మీ కాలింగ్ సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతదేశంలో మనమంతా జన్మించడం గర్వకారణమని జిల్లా ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు అన్నారు. భారతమాత ముద్దుబిడ్డలుగా నేటి యువత ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని బ్యాంకర్స్‌కాలనీలో ఉన్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ క్యాంపస్‌లో.. ఆ సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.రమణ ఆధ్వర్యంలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జండాను ఏఎస్పీ ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం న్యూ బ్లడ్ బ్యాంకు వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1999 ఏప్రిల్‌లో దేశ సరిహద్దులో జరిగిన కార్గిల్ పోరులో సుమారు 500 మంది సైనికులు తమ ప్రాణాలకు పణంగా పెట్టి పోరాటం చేశారన్నారు. 1999 జూలై 26న భారత సైన్యం తమదైన వ్యూహాలతో పాకిస్తాన్ దళాలు, తీవ్రవాదులు ఆక్రమించిన కార్గిల్‌లోని అన్ని సైనిక పోస్టులను తిరిగి స్వాధీనం చేసుకుందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఏటా జూలై 26న ఆర్మీ విజయవంతమైన మిషన్ (ఆపరేషన్ విజయ్ అని పిలుస్తారు) గౌరవార్థం కార్గిల్ విజయ్ దివస్ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్గిల్ పోరులో అమరులైన వీర జవానులకు ఈ సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రముఖ గైనిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ ఆర్మీ కాలింగ్ సంస్థ ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ విజయ్ పేరిట కార్గిల్ పోరులో భాగస్వామ్యులైన సైనికుల సేవలను భారతదేశం ఎప్పటికీ మరిచి పోదన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరే నిజమైన హీరోలని అభిప్రాయపడ్డారు. ఆర్మీలో చేరేందుకు యువతను తీర్చిదిద్దుతున్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ సేవలు అమోఘమన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందిస్తున్న పలువురు సేవామూర్తులకు ఏఎస్పీ విఠలేశ్వరరావు చేతులమీదుగా సత్కరించారు. కార్యక్రమంలో హారికా కన్‌స్ట్రక్షన్ అధినేత హారికా ప్రసాద్, ఇంటాక్ ప్రతినిధి వి.జగన్నాథంనాయుడు, సంఘసేవకులు మంత్రి వెంకటస్వామి, ఇండియన్ ఆర్మీ మేజర్ సుబేదార్ డి.విష్ణుమూర్తి, సబార్డినేటర్ రవికుమార్, ఎస్ఐ ప్రవళ్లిక, కొల్లి విశ్వనాథం, రోటరీ క్లబ్ అధ్యక్షులు గీతా శ్రీకాంత్, గ్రీన్ సిటీ అధ్యక్షులు మణిశర్మ, గురుగుబిల్లి నాగరాజు పాల్గొన్నారు.

సంఘసేవలో మాజీ సైనికుల ఆదర్శప్రాయం



గార: ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న మాజీ సైనికుల సమాఖ్య ప్రతినిధులు

గార: సైనికులుగా దేశ సేవ చేసి.. మాజీలైనా సంఘ సేవ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం కొనియాడారు. గార మండలం సతివాడలో కార్గిల్ దివస్ వేడుకలు ఘనంగా జరగ్గా.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మాజీ సైనికుల సమాఖ్య చయర్మన్ గ్రూప్ కెప్టెన్ సి.ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా నుంచి కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు హవల్దార్లు సింహాచలం, నీలాచలంలను స్మరించుకున్నారు. సతివాడ మాజీ సైనికులు, ప్రస్తుతం ఫోర్స్‌లో ఉన్న సైనికులు (తాళ్ల పాపారావు, చల్లా అప్పలనాయుడు, చింటు రామారావుల ఆధ్వర్యంలో) ఊరి ఆరంభంలో ముఖద్వారాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఈసీహెచ్ఎస్ అధికారి (విశ్రాంత కల్నల్) మెండ నారాయణరావు, జిల్లా సైనికుల క్యాంటీన్ మేనేజర్ టి.కృష్ణారావు, వీరనారీమణి జగ్గమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పెదలాపు శ్రీరాములు, సర్పంచి యాళ్ల నారాయణ, మాజీ సర్పంచి పెదలాపు సింహాచలం, వివేకానంద యూత్ లీడర్ పి.రాజు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మాజీ సైనికులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి

- స్పీకర్ తమ్మినేని సీతారాం



అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ శాఖ అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటా కుళాయిల ద్వారా స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు వాటర్ ట్యాంకుల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నియోజకవర్గానికి రూ. 157 కోట్ల నిధులతో 182 వాటర్ ట్యాంకులు మంజూరు చేసి ప్రతి గ్రామంలోనూ పనులు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ఎన్ని పూర్తయ్యాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రక్షిత పథకాల నిర్మాణానికి అవసరమయ్యే ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ శాఖ అధికారులు గుర్తించాలన్నారు. అధికారులు గుర్తించిన స్థలాల్లో ట్యాంకుల నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. స్థల సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమదాలవలస మండలానికి 47, సరుబుజ్జిలికి 43, బూర్జకి 52, పొందూరు మండలానికి 40 ట్యాంకులు మంజూరైనట్లు పేర్కొన్నారు. వీటి నిర్మాణాల విషయంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో వెంకట్రామన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సూర్యనారాయణ, నాలుగు మండలాల ఏఈలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కారం

- ప్రభుత్వానికి అర్చక సమాఖ్య కృతజ్ఞతలు



సంక్షేమంపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల కాపీలతో అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్రంలో అర్చకుల సమస్యలను పరిష్కరించి మేలు చేసిన ప్రభుత్వానికి ఎల్లవేళలా కృతజ్ఞతతో ఉంటామని ఏపీ అర్చక సమాఖ్య సభ్యులు తెలిపారు. శ్రీకాకుళంలోని గుడివీధి కోటేశ్వరస్వామి దేవాలయంలో ఏపీ అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభ పండా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని దేవాలయాలలో గుడికి అర్చక సమాఖ్యపేరిట రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉన్న దేవాలయాలను అర్చకులు తీసుకునేలా వారిలో అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఆలయాల అస్తుల పరిరక్షణ, ధూప దీప నైవేద్యం, అర్చకుల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేయడంపై ఆనందంగా ఉందన్నారు. వంశపారంపర్య హక్కును గత ప్రభుత్వం తుంగలో తొక్కినప్పటికీ ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చొరవతో మళ్లీ ఆ హక్కును పునరుద్ధరించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్చకుల పేర్లను 43/10 రిజిష్టరులో నమోదు చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇటీవల రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన అర్చకుల సమాఖ్య రాష్ట్ర సమావేశంలో అనేక డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు వివరించారు. ఉద్యోగ విరమణ లేకుండా చేయడం, కనీస వేతనం రూ.10 వేల నుంచి రూ.15,625 ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తూ సర్క్యులర్ జారీ చేసినట్టు పేర్కొన్నారు. ధూప దీప నైవేద్యాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5 వేలను రూ.10 వేలు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ పథకంలో మరో 11 వందల దేవాలయాలు చేరనున్నట్టు చెప్పారు. దీనికోసం టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. దేవాలయాల ఆస్తుల ఆక్రమణకు అడ్డుకట్ట వేసే విధంగా.. వాటి పరిరక్షణ కోసం ప్రత్యేక ఆర్డినెన్సును ప్రభుత్వం జారీ చేసినట్లు వివరించారు. రూ.5 లక్షలు పైబడి వార్షిక ఆదాయం వస్తున్న దేవాలయల్లో పనిచేస్తున్న అర్చకులకు సర్వీసు రెమ్యూనరేషన్ కింద నూతన స్కీంను ఏర్పాటు చేయాలని, అర్చకులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు చేపట్టాలని కోరామన్నారు. అర్చక సర్వీసు ఇనామ్ భూములకు రైతు భరోసా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలు దేవాలయాల అర్చకులు, సమాఖ్య సభ్యులు గంట చినరామూర్తి, సంతోష్‌శర్మ, పెంట శ్రీరామమూర్తిశర్మ, పి.శ్రీనివాసరావు, మోదుకూరి కిరణ్‌కుమార్‌శర్మ, కోసూరు మాధవరావు, తిరుమల చంద్రశేఖరశర్మ, పెంట రాజగోపాల్ శర్మ, గంధం దుర్గా ప్రసాద్ శర్మ, కృష్ణారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సకాలంలో రైతులకు ఎరువులు



ఎరువుల విక్రయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాలకు కావాల్సిన ఎరువులను సకాలంలో ప్రభుత్వం అందజేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట పట్టణంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఎరువులు, విత్తనాలు కావాలంటే మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతుభరోసా కేంద్రాలు, డీసీఎంఎస్, పీఏసీఎస్ ద్వారా సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేస్తోందన్నారు. రైతు సంక్షేమానికి, రైతు అవసరాలు గుర్తించి వాటిని సకాలంలో పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సర్కార్ ద్వారా అందిస్తున్న సేవలు గుర్తించి ప్రభుత్వానికి రైతులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోంపేట, ఇచ్ఛాపురం ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, బోర పుష్ప, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, పంచాయతీ ఈవో వరప్రసాద్, డీసీఎంఎస్ ప్రతినిధి టి.రాజేష్ పాల్గొన్నారు.

ఒకటిన సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఎచ్చెర్ల క్యాంపస్: చిన్నకొంగరాం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటో తేదీన సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం.లలితకుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని రామాలయంలో ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి ఉన్న దంపతులు పూజా సామగ్రితో హాజరు కావాలని, సంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98669 14160, 95537 45950 నంబర్లను సంప్రదించాలి.

వేధిస్తున్నారని ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: తన భర్త కట్నం కోసం వేధిస్తున్నారని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోకి చెందిన మహిళ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ బలివాడ గణేష్ బుధవారం తెలిపారు. విశాఖపట్నం ఎన్టీపీసీఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న తన భర్తకు ఇది వరకే వివాహమైందని.. ఆ విషయాన్ని దాచిపెట్టి తనను పెళ్లి చేసుకోవడమేకాకుండా.. కట్నం తెమ్మంటూ మానసిక వేదనకు గురిచేస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెన్నైలో మత్స్యకారుడు అనుమానాస్పద మృతి



కోనేరు లోహిదాస్ (ఫైల్)

సోంపేట: మండలంలోని ఇస్కలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కోనేరు లోహిదాస్ (35) చెన్నైలో అనుమానాస్పదస్థితిలో ప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటా చేపల వేట నిషేధ సమయమైన మే నెలలో లోహిదాస్ చెన్నైకు వేట కోసం వెళ్తుంటాడు. ఈ ఏడాది కూడా అక్కడకు వెళ్లి చేపల వేట చేసుకుంటూ వచ్చే ఆదాయంతో జీవనాధారం పొందుతున్నాడు. కాగా బుధవారం తెల్లవారుజామున చెన్నైలోని ఓ కాలువలో శవమై కనిపించాడు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డ్, సెల్ ఫోన్ ఆధారంగా లోహిదాస్‌గా అక్కడ పోలీసులు, తోటి మత్స్యకారులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. లోహిదాస్‌ది సహజ మరణం కాదని హత్యని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. హత్యా కోణంలోనే దర్యాప్తు చేపట్టాలని అక్కడి పోలీసులను కోరుతున్నారు. లోహిదాస్‌కు తల్లి కామమ్మ, భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో కన్నీరుమున్నీరుగా రోదించారు. ఒకే రోజు వ్యవధిలో గ్రామానికి చెందిన ఇద్దరు మత్స్యకారులు మృతి చెందడంతో ఇస్కలపాలెంలో విషాదాయలు అలుముకున్నాయి.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



విత్తనాలను ప్యాక్ చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీఏ సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. ఇందులో భాగంగా వివిధ కూరగాయల విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ రేవతి ఆధ్వర్యంలో 360 రోజులు పంటలు వచ్చే విధంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టడం జరుగుతుందన్నారు. కేశవరావుపేట గ్రామంలో సేకరించిన విత్తనాలను ప్యాకెట్లుగా తయారు చేసి రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు.

అభ్యసనంపై ఆసక్తి పెంచేలా బోధన



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న పగడాలమ్మ

హిరమండలం: అభ్యసనంపై ఆసక్తి పెంచేలా విద్యాబోధన చేయాలని టెక్కలి డిప్యూటీ ఈవో పగడాలమ్మ సూచించారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తరగతి గదిలో వినూత్న పద్ధతిలో బోధన చేయడం ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మెరుగు పడతాయన్నారు. విద్యాప్రగతికి ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందన్నారు. ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆగస్టు మొదటి వారంలో జరిగే ఎఫ్ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పిల్లలకు భోజనాన్ని వడ్డించారు. ఎంఈవోలు కె.రాంబాబు, టి.షణ్ముఖరావు ఉన్నారు.